

ఆలయంలో హుండీ చోరీ

దుండగులు ఆలయంలోని హుండీని ఎత్తుకెళ్లిన సంఘటన ఇబ్రహీంపట్నం ఠాణా పరిధిలోని పోల్కంపల్లిలో జరిగింది. 8లో▸



ఆధ్యాత్మిక చింతనతో..


ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని వీహెచ్‌పీ భాగ్యనగర్ క్షేత్ర సేవా ప్రముఖ్ బండారి రమేష్ అన్నారు. 8లో▸



మున్సిపాలిటీ అభివృద్ధికి..

మున్సిపాలిటీలను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నట్లు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. 8లో▸

కొత్తవి కొందరికే !



ఈ నెల 26 నుంచి రేషన్ కార్డుల జారీ

- క్షేత్రస్థాయిలో పరిశీలించేది 83 వేల దరఖాస్తులే..
- సమగ్ర కుటుంబ సర్వే వివరాలతోనే పంపిణీ
- 'ప్రజాపాలన' అర్జీలు అంతేనా?

ఇదీ షెడ్యూలు

- ఈ నెల 16 నుంచి 20 వరకు క్షేత్రస్థాయి సర్వే
- 21 నుంచి 24 మధ్య వార్డు సభల్లో లబ్ధిదారుల వివరాల వెల్లడి
- 21 నుంచి 25 మధ్య అర్హుల డేటా ఎంట్రీ
- 26 (రిపబ్లిక్‌డే) నుంచి రేషన్ కార్డుల జారీ

సాక్షి, రంగారెడ్డి జిల్లా: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26 నుంచి పంపిణీ చేయనున్న కొత్త రేషన్ కార్డులు కొందరికే అందనున్నాయి. సమగ్ర కుటుంబ సర్వే కోసం ఇటీవల నిర్వహించిన ఇంటింటి (సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల) సర్వేలో అందిన వివరాల ఆధారంగా రేషన్ కార్డుల్లేని కుటుంబాలు గ్రేటర్ పరిధిలో 83,285 మాత్రమే ఉన్నట్లు అధికారులు లెక్కలు తీశారు. ఆ లెక్క మేరకే క్షేత్రస్థాయి సర్వే జరుపుతున్నారు. క్షేత్రస్థాయిలోనూ అర్హులుగా గుర్తించిన వారికే కొత్త రేషన్ కార్డులివ్వనున్నారు.

ఎదురు చూస్తున్న వారెందరో?

నిజానికి గ్రేటర్ పరిధిలోని ఆయా జిల్లాల పరిధిలో దాదాపు పది లక్షల మంది రేషన్ కార్డుల్లేక ఇబ్బందులు పడుతున్నారు. గత సంవత్సరం ఆరు గ్యారంటీల దరఖాస్తుల స్వీకరణకు నిర్వహించిన 'ప్రజాపాలన' కార్యక్రమాల్లో రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారు దాదాపు 5.43 లక్షలున్నారు. మిగతావారు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోలేదు. ఇంటింటి సర్వే సైతం నూరు శాతం జరగలేదు. కొందరు సర్వేను వ్యతిరేకించారు. వారిలో రేషన్‌కార్డుల్లేని వారికి సైతం ఇప్పుడు అవి అందే పరిస్థితి లేకుండాపోయింది. కుటుంబ సర్వే మేరకు రేషన్‌కార్డుల్లేని కుటుంబాలను పరిశీలించి వారికి మాత్రమే ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

పాత మార్గదర్శకాలే..

2014లో అప్పటి ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగానే కొత్త రేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు ఇటీవల హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రేషన్‌కార్డులు లేనివారు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని, వాటిని కూడా పరిశీలించి కార్డులు జారీ చేస్తామన్నారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. కానీ ప్రజాపాలనలో అందిన దరఖాస్తులను ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదో అంతు చిక్కడం లేదు.

క్షేత్రస్థాయి పరిశీలన తర్వాతే..

క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం అర్హుల జాబితా వార్డుసభలో వెల్లడించి చర్చించాకే ఆమోదిస్తారని ప్రభుత్వం పేర్కొంది. అలా ఎంపికైన వారి జాబితాను జీహెచ్‌ఎంసీ పరిధిలో కమిషనర్ లాగిన్‌కు పంపుతారు.వాటిని పరిశీలించి కమిషనర్ పౌరసరఫాల శాఖ కమిషనర్ లాగిన్‌కు పంపుతారు. పరిశీలించి కొత్త కార్డులు జారీ చేస్తారు. అర్హత కలిగిన వ్యక్తి పేరు ఒక్క రేషన్‌కార్డులో మాత్రమే ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఒకే వ్యక్తి పేరు ఒకటికి మించి ఉండటానికి వీల్లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. సభ్యుల చేర్పులు, తొలగింపులు సైతం చేయనున్నట్లు పేర్కొంది.



రావిర్యాలలో రైతులతో మాట్లాడుతున్న అధికారులు

భూములిచ్చేది లేదు

- తేల్చి చెప్పిన రైతులు
- 'గ్రీన్‌ఫీల్డ్'పై అభిప్రాయ సేకరణ

తుక్కుగూడ: ఫోర్త్‌సిటీలో భాగంగా గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణానికి భూములు ఇచ్చేది లేదని రైతులు స్పష్టం చేశారు. మున్సిపల్ పరిధిలోని రావిర్యాల వార్డు కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ అధికారులు అభిప్రాయ సేకరణ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు భూ సేకరణ డిప్యూటీ కలెక్టర్ రాజు, మహేశ్వరం తహసీల్దార్ భూ నిర్వాసితులతో మాట్లాడి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. రావిర్యాల ఎగ్జిట్ -13 నుంచి ఆమనగల్లు వరకు (41.5 కిలోమీటర్లు) ప్రభుత్వం గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ఏర్పాటు చేస్తోందని తెలిపారు. కొంగరకుర్దు ఏ,బీ రెవెన్యూ పరిధిలోని 28 మంది రైతులకు సంబంధించి 57.7 గుంటల భూమి పోతుందన్నారు. ఇందులో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు అభిప్రాయాలు సేకరించేందుకు సమావేశం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. రైతులు మాట్లాడుతూ.. ఇప్పటికే తాము ఔటర్‌రింగు రోడ్డు, ఫ్యాబ్‌సిటీలో పోయిన భూములకు నష్ట పరిహారం రాక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కలెక్టర్ కార్యాలయం నుంచి రోడ్డు ఏర్పాటు చేసే అవకాశం ఉన్నా తమ భూములు లాక్కొని రోడ్డు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏమిటని వారు ప్రశ్నించారు. ఎట్టి పరిస్థితుల్లో తాము భూములిచ్చేది లేదని తేల్చి చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ స్వర్ణకుమారి, సిబ్బంది, కౌన్సిలర్లు శివకుమార్, యాదగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బేగరికంచెలో రైతులతో సమావేశమైన తహసీల్దార్ తదితరులు

బేగరికంచె రైతులతో సమావేశం

కందుకూరు: ఫ్యూచర్ సిటీ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న మండల పరిధిలోని బేగరికంచె రైతులతో శుక్రవారం రెవెన్యూ అధికారులు సమావేశమయ్యారు. తహసీల్దార్ గోపాల్, భూసేకరణ నాయబ్ తహసీల్దార్ తారక్ తదితరులు మీర్‌ఖాన్‌పేట రెవెన్యూ పరిధిలోని దేవాలయ భూములను సాగు చేసుకుంటున్న బేగరికంచె రైతులతో పరిహారం విషయమై చర్చించారు. ప్రభుత్వం నుంచి భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం అందిస్తామని అధికారులు వారికి తెలిపారు. బహిరంగ మార్కెట్ ధర ప్రకారం పరిహారం రూ.2 కోట్లు, ఎకరాకు 121 గజాల ప్లాటుతో పాటు కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించాలని రైతులు కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్తామని రైతులకు తెలిపి సమావేశాన్ని ముగించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ యాదగిరి, రైతులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్

ఇబ్రహీంపట్నం రూరల్: గణతంత్ర వేడుకలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఎలాంటి లోటు పాట్లకు తావులేకుండా అట్టహాసంగా వేడుకలు జరిగేలా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వివిధ వర్గాల వారి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా సమగ్ర వివరాలతో జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలన్నారు. ఉత్తమ ఉద్యోగుల ఎంపిక కోసం శాఖల వారీగా పరిమితితో కూడిన ప్రతిపాదనలు పంపించాలన్నారు. వేదికను పూలతో అందంగా అలంకరించేందుకు ఉద్యాన శాఖ అధికారికి సూచించారు. కలెక్టరేట్ పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉండేలా చూడలని ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణ అందరి బాధ్యత



ట్రాఫిక్ నియమాలపై డ్రైవర్లకు అవగాహన

షాద్‌నగర్‌రూరల్: ట్రాఫిక్ రూల్స్ పాటించి రోడ్డు ప్రమాదాలను నివారించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంవీఐ వాసు అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం భారీ వాహనాల డ్రైవర్లకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెప్ప పాటులో జరిగే చిన్న పాటి పొరపాటు ప్రమాదాలకు దారి తీస్తుందని తెలిపారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నియమాలపై తప్పనిసరి అవగాహన కలిగి ఉండాలన్నారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, మద్యం తాగి వాహనాలను నడపడంతోనే ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. వాహనాలను నడిపే సమయంలో డ్రైవర్లు ఏకాగ్రతతో ఉండాలన్నారు. ఎక్కువ దూరం వాహనాలను నడిపినప్పుడు తప్పకుండా విశ్రాంతి తీసుకోవాలన్నారు. ప్రతి డ్రైవర్ కంటి పరీక్షలు, బీపీ, షుగర్‌వంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వాహనాలకు వెనుక భాగంలో రెడ్, ముందు భాగంలో వైట్ స్టిక్కర్లను అతికించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎంవీఐ ఫయాజ్‌హుస్సేన్, డీవీఐ సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'వర్గీకరణ' ఉద్యమానికి మద్దతివ్వండి

- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ మాదిగ



సమావేశంలో పాల్గొన్న నాయకులు

మహేశ్వరం: ఎస్సీ వర్గీకరణ కోసం మంద కృష్ణ మాదిగ చేస్తున్న ఉద్యమానికి మద్దతుగా నిలవాలని సంఘం జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ మాదిగ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని వత్తుల రఘుపతి కాంప్లెక్స్‌లో శుక్రవారం మాదిగ ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో 'వేల గొంతులు-లక్ష డప్పుల' పేరిట భారీ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి మాదిగ, ఉప కులాలు పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఎస్సీ వర్గీకరణ చేయాలని సుప్రీంకోర్టు ఇటీవల తీర్పు ఇచ్చినప్పటికీ కొంతమంది స్వార్థపరులు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక శక్తుల గుండెల్లో దండోరా డప్పులు మోగించేందుకే భారీ ప్రదర్శన చేపట్టనట్టు చెప్పారు. ఈ క్రమంలో ఈ నెల 28న మహేశ్వరానికి మంద కృష్ణ మాదిగ రానున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు రావుగళ్ల బాబు మాదిగ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జంగయ్య, బీఆర్‌ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు హన్మగళ్ల చంద్రయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వత్తుల రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

సాగు భూముల గుర్తింపులో జాగ్రత్త

- అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్



భూముల నమోదు ప్రక్రియను అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు వివరిస్తున్న అధికారులు

యాచారం: సాగు యోగ్యమైన వ్యవసాయ భూముల గుర్తింపులో అప్రమత్తత అవసరమని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. రైతు భరోసా పథకం వర్తింపునకు లబ్ధిదారుల గుర్తింపు కోసం రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహిస్తున్న సాగు యోగ్యమైన భూముల గుర్తింపు ప్రక్రియను ఆమె శుక్రవారం యాచారం రైతు వేదికలో పరిశీలించారు. ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి, ఏడీఏ సూజాతతో కలిసి సాగు యోగ్యమైన భూములను ఏ విధంగా గుర్తిస్తున్నారు.. సాగు యోగ్యం కాని భూములను ఎలా గుర్తిస్తున్నారు.. అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల గూగుల్ మ్యాప్‌ను పరిశీలిస్తూ సాగు యోగ్యం కాని భూముల్లో గుట్టలు, రాళ్లు, రప్పలున్న ప్రాంతాలపై ఆరా తీశారు. సాగు యోగ్యమైన వ్యవసాయ భూములున్న నిజమైన రైతులకే రైతు భరోసా పథకం అందేలా కృషి చేయాలన్నారు. సాగు యోగ్యమైన భూముల గుర్తింపులో ఏ మాత్రం తప్పులు దొర్లితే బాధ్యులైన ఆ గ్రామాల రెవెన్యూ, వ్యవసాయ అధికారులపై చర్యలుంటాయని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో యాచారం తహసీల్దార్ అనంత్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి రవినాథ్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం

- కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన నేతలు
- షాబాద్‌లో బీఆర్‌ఎస్ రైతు దీక్ష
- ఆద్యంతం ఉత్సాహం నింపిన ప్రసంగాలు
- తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు
- పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజం



గులాబీ పూలతో కేటీఆర్‌కు ఘన స్వాగతం పలుకుతున్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

షాబాద్: మండల కేంద్రంలో శుక్రవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు దీక్ష విజయవంతం కావడం పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది. జిల్లా నలుమూలల నుంచి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీక్షకు ముఖ్యఅతిథిగా హాజరైన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు ఘన స్వాగతం పలికారు. జేసీబీ వాహనాలతో గులాబీ పూల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా నేతలు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలు, అక్రమాలను ఎండగట్టారు. నేతల ప్రసంగాలు పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపాయి.

స్థానిక ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలి

రైతులను ఆగం చేస్తున్న ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని మాజీ మంత్రి సబితారెడ్డి సూచించారు. కేసీఆర్ హయాంలో వర్షాలు పడే సమయానికి ఏడాదికి రెండుసార్లు రైతుల ఖాతాల్లో రైతుబంధు డబ్బులు జమచేసే వారని గుర్తు చేశారు. ఫోన్లలో టింగ్‌టింగ్‌మని శబ్దం వచ్చేదన్నారు. రైతులను, మహిళలను ఆగం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు.

కాంగ్రెస్ కుట్రలను తిప్పికొడతాం

రైతులకు రుణమాఫీ, రైతుబంధు, 24 గంటల కరెంటు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని మాజీ మంత్రి మహమూద్ అలీ అన్నారు. రైతులు, మహిళలను మోసం చేసి గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని విమర్శించారు. కేటీఆర్‌ను జైలుకు పంపేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని.. ఆ ప్రయత్నాలను తిప్పికొడతామని చెప్పారు.

దృష్టిని మరల్చేందుకే అక్రమ కేసులు

కేటీఆర్ కృషి ఫలితంగానే ఈ కార్ రేస్ మన రాష్ట్రానికి వచ్చిందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. ఈకార్ రేస్‌లో పెట్టుబడులు పెట్టడంతో రాష్ట్రానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా రూ.700 కోట్ల ఆదాయం సమకూరిందన్నారు. కాంగ్రెస్ ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీలు, హామీలు అమలు చేయక పోవడంతో ఎక్కడ తమను నిలదీస్తారనే భయంతో.. వారి దృష్టిని మరల్చేందుకే కేటీఆర్‌పై అక్రమ కేసు బనాయించారని ఆరోపించారు.

అసత్య ప్రచారం సిగ్గుచేటు

తెలంగాణలో ఇచ్చిన హామీలను గంగలో కలిపిన సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో ఆరు గ్యారంటీలు, రుణమాఫీ చేసినట్లు చెప్పుకోవడం సిగ్గు చేటని బీఆర్‌ఎస్ సీనియర్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ దుయ్యబట్టారు. గురుకుల హాస్టళ్లలో విద్యార్థులు విషపు ఆహారంతో అల్లాడినా ఈ ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. ఉచిత కరెంటు ఇవ్వలేదని, గ్యాస్ సబ్సిడీ లేదని, నెలకు రూ.2,500, కల్యాణలక్ష్మికి తులం బంగారం ఇవ్వడం లేదని విమర్శించారు.

హామీల అమలులో విఫలం

షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ మాట్లాడుతూ.. ఎన్నికల హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. రేవంత్‌రెడ్డి సర్కార్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. రైతు భరోసా రూ.15వేలు ఇవ్వాలని కోరారు.

ధైర్యంగా ముందుకు సాగుదాం

వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని, వాటిని ధైర్యంగా ఎదుర్కొంటూ ముందుకు సాగుదామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, ముఠా గోపాల్, మాజీ ఎమ్మెల్యేలు కొప్పుల మహేశ్‌రెడ్డి, బాల్క సుమన్, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ యువనేతలు కార్తీక్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నాగేందర్‌గౌడ్, ఆంజనేయులు, స్వప్న, పార్టీ మండల అధ్యక్షుడు నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

కక్ష సాధింపు చర్యలు

కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. లగచర్ల రైతులకు మద్దతుగా నిలబడినందుకు తనను 35 రోజులు, రైతులను సంగారెడ్డి జైలులో పెట్టి కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారని మండిపడ్డారు. రైతుభరోసా రూ.15వేలకు బదులు రూ.12వేలు ఇవ్వడాన్ని తప్పుబట్టారు. పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.



ర్యాలీగా తరలివస్తున్న నాయకులు, కార్యకర్తలు



దీక్షలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సబితారెడ్డి

న్యూస్‌రీల్

పర్యావరణాన్ని కాపాడుకుందాం



సదస్సులో సీజీఆర్ చైర్ పర్సన్ లీలాలక్ష్మారెడ్డి, నిర్వాహకులు, కళాకారులు, డీఆర్పీలు

కడ్తాల్: సంస్కృతి సంప్రదాయాలతో పాటు పర్యావరణాన్ని కాపాడుకుందామని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ చైర్ పర్సన్ లీలా లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని ఎర్త్ సెంటర్‌లో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్, సీసీఆర్‌టీ, డీఆర్‌పీలు సంయుక్తంగా ఎర్త్ అండ్ కల్చర్ అంశంపై నిర్వహిస్తున్న జాతీయ విద్యా సదస్సు శుక్రవారానికి రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా లీలా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ, మానవతా విలువలు ముఖ్యమని పేర్కొన్నారు. అనంతరం పర్యావరణవేత్తలు ఉమామహేశ్వర్‌రెడ్డి, సాయిభాస్కర్‌రెడ్డి భూమికి సంబంధించి, ఫారెస్ట్ వాక్, వ్యాల్యూ వాచ్, యంగ్ ఎర్త్ లీడర్స్ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. అన్నలదేవి రాజేశ్వరి ఆధ్వర్యంలో ప్రదర్శించిన పేరిణి నృత్యం, పెరుమాండ్ల వేణుగోపాల్ లాస్య నృత్యం, కత్తి స్వరూపరాణి బోనాల నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో 16 రాష్ట్రాలకు చెందిన 60 మంది డీఆర్పీలు, సీజీఆర్ వ్యవస్థాపకుడు లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగుకు పనికిరాని భూముల పరిశీలన

జిల్లా వ్యవసాయాధికారి నరసింహారావు



చేవెళ్ల మండలం తంగడపల్లిలో భూములను పరిశీలిస్తున్న అధికారులు

చేవెళ్ల/మొయినాబాద్: రైతు భరోసా పథకం సర్వేలో భాగంగా సాగుకు ఉపయోగపడని భూములను పరిశీలిస్తున్నట్టు జిల్లా వ్యవసాయాధికారి నరసింహారావు తెలిపారు. చేవెళ్ల మండల పరిధిలోని తంగడపల్లిలో శుక్రవారం రెవెన్యూ, వ్యవసాయాధికారులతో కలిసి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో సర్వే నిర్వహించి సాగుకు పనికిరాని భూములను గుర్తిస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో మొత్తం ఎన్ని ఎకరాల భూమి ఉంది.. అందులో సాగు భూమి ఎంత..? ప్రభుత్వ భూమి ఎంత..? సాగుకు పనికిరాని భూమి ఎన్ని ఎకరాలు..? అనే అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు సేకరిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ నెల 20 నాటికి అన్ని గ్రామాల్లో సర్వే పూర్తవుతుందన్నారు. ఆయన వెంట తహసీల్దార్ కృష్ణయ్య, చేవెళ్ల డివిజన్ వ్యవసాయాధికారి సురేష్‌బాబు, ఏఓ శంకర్‌లాల్, ఆర్‌ఐ పవన్, ఏఈఓలు రాజేశ్వర్ రెడ్డి, స్వాతి తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో దీపారాధన



దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కొత్తూరు: జేపీదర్గా ఉర్సులో భాగంగా రెండో రోజు శుక్రవారం దీపారాధన ఘట్టం ముగిసింది. ఇందులో భాగంగా స్థానికులతో పాటు హైదరాబాద్, ఆయా ప్రాంతాలకు చెందిన మహిళలు దర్గా ఆవరణలో దీపాలు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బాబా దర్శనం కోసం ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఇబ్బంది పడకుండా వక్ఫ్‌బోర్డు అధికారులు ఏర్పాట్లు చేశారు.

గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీలో చేవెళ్ల వాసులు

చేవెళ్ల/మొయినాబాద్: గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా చేవెళ్ల నియోజకవర్గానికి చెందిన ఐదుగురు ప్రమాణ స్వీకారం చేశారు. పాలకవర్గం ప్రమాణస్వీకారం శుక్రవారం నగరంలోని గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్‌లో జరిగింది. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, ప్రకాశ్‌గౌడ్, వీర్లపల్లి శంకర్ తదితరులు పాల్గొని పాలకవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. చేవెళ్లకు చెందిన పాండు, లక్ష్మారెడ్డి, షాబాద్‌కు చెందిన చంద్రశేఖర్, శంకర్‌పల్లికి చెందిన జనార్దన్‌రెడ్డి, నవాబ్‌పేటకు చెందిన వెంకట్‌రెడ్డి డైరెక్టర్లుగా ప్రమాణం చేశారు.

దూసుకొచ్చిన మృత్యువు

- బైక్‌ను ఢీకొట్టిన డీసీఎం
- డిగ్రీ విద్యార్థి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు


వెంకటేశ్ (ఫైల్)


ఘటనాస్థలిలో క్షతగాత్రులు

బొంరాస్‌పేట: సంక్రాంతి సెలవులకు సొంతూరికి వచ్చిన ఓ విద్యార్థిని రోడ్డు ప్రమాదం బలి తీసుకుంది. కుటుంబసభ్యుడితో బయటికి వెళ్లిన అతడిపై మృత్యువు డీసీఎం రూపంలో దూసుకొచ్చింది. ఈ విషాద సంఘటన మండల పరిధిలోని మైసమ్మగడ్డతండా గేటు సమీపంలోని రంగయ్యవాడ్క కల్వర్టు వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. తండాకు చెందిన మాజీ ఉప సర్పంచ్ రాములునాయక్ కుమారుడు దేగావత్ వెంకటేశ్(21) జడ్చర్ల గురుకుల కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. రాములు నాయక్ తమ్ముడు పూల్యానాయక్ కొడుకైన దేగావత్ సంతోష్ వ్యవసాయం చేస్తున్నాడు. కాగా తన ఆరోగ్యం బాగోలేదని, ఆస్పత్రికి వెళ్దామని శుక్రవారం తన బైక్‌పై వెంకటేశ్‌ను తీసుకుని పరిగికి బయల్దేరారు. మార్గమధ్యలో పరిగి నుంచి కొడంగల్ వెళ్తున్న డీసీఎం అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెనకాల ఉన్న వెంకటేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న సంతోష్‌కు తీవ్ర గాయాలవ్వగా పరిగి ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని కొడంగల్ మార్చురీకి తరలించామని ఎస్ఐ ఎండీ రవూఫ్ తెలిపారు. పండగ సెలవుల్లో ఇంటికి వచ్చిన తన కొడుకు చనిపోవడంతో తల్లిదండ్రులు, తండావాసులు పెట్టిన బోరున విలపించారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

వీహెచ్‌పీ భాగ్యనగర్ క్షేత్ర సేవా ప్రముఖ్ రమేశ్


పూజలో పాల్గొన్న రమేశ్ తదితరులు

షాద్‌నగర్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని వీహెచ్‌పీ భాగ్యనగర్ క్షేత్ర సేవా ప్రముఖ్ బండారి రమేశ్ అన్నారు. సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని శుక్రవారం మిత్రా యూత్ అధ్యక్షుడు మలగారి సత్యనారాయణ ఆధ్వర్యంలో పట్టణంలోని గంజ్‌లోగల వినాయకస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీహెచ్‌పీ భాగ్యనగర్ క్షేత్ర సేవా ప్రముఖ్ బండారి రమేశ్, మున్సిపల్ చైర్మన్ నరేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, సన్మార్గంలో నడుచుకొని సమాజానికి తమవంతుగా సేవ చేయాలన్నారు. దైవభక్తిని అలవర్చుకొని ఆధ్యాత్మిక కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో అభిలాష్, శ్రీనివాస్ రెడ్డి, ప్రవీణ్, సంగమేష్, శేఖర్‌రెడ్డి, శ్రీధర్, రవి, శేఖర్‌అప్ప, గోపాల్, శ్రీకాంత్, శంకర్‌లాల్ లాహోటి, మహావీర్, భరత్, విష్ణుశర్మ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎండీఏ భూసేకరణ షురూ

- అబ్దుల్లాపూర్‌మెట్‌లో 156.02 ఎకరాలకు నోటిఫికేషన్
- భారీ లేఅవుట్‌కు సన్నాహాలు
- గతంలో ఆన్‌లైన్‌బిడ్డింగ్ ద్వారా పెద్ద ఎత్తున ఆదాయం

సాక్షి, సిటీబ్యూరో: భూముల అమ్మకాల ద్వారా గతంలో పెద్ద ఎత్తున ఆదాయాన్ని ఆర్జించిన హెచ్‌ఎండీఏ మరోసారి అదే తరహాలో భూ వేలానికి రంగం సిద్ధం చేసింది. అబ్దుల్లాపూర్‌మెట్, తిమ్మాయిగూడ ప్రాంతంలో సుమారు 156.02 ఎకరాల భూమి సేకరణకు తాజాగా నోటిఫికేషన్ విడుదల చేసింది. గతంలో రైతుల నుంచి భూములను సేకరించి భారీ లేఅవుట్‌లను అభివృద్ధి చేసిన సంగతి తెలిసిందే. అదేవిధంగా అబ్దుల్లాపూర్‌మెట్‌లోనూ భారీ లేఅవుట్ ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. రైతుల నుంచి సేకరించనున్న భూములపై ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా 30 రోజుల్లో తెలియజేయాలని తాజా నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. గతంలో బుద్వేల్, కోకాపేట్, మోకిలా, బాచుపల్లి, ఉప్పల్ భగాయత్, బోడుప్పల్, తొర్రూర్, హయత్‌నగర్, తదితర ప్రాంతాల్లో ఆన్‌లైన్ బిడ్డింగ్‌కు కొనుగోలుదార్ల నుంచి అనూహ్య స్పందన లభించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు భూసేకరణ ముందుకు సాగలేదు. పైగా ఆన్‌లైన్ బిడ్డింగ్ పైన కూడా అధికారులు వెనుకంజ వేశారు. రియల్‌ఎస్టేట్ రంగంలో నెలకొన్న స్తబ్ధత దృష్ట్యా భూముల వేలం ప్రతిపాదనను విరమించుకున్నారు. ఈ క్రమంలోనే తాజాగా అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతంలో సేకరణకు చర్యలు చేపట్టడం గమనార్హం. రైతుల నుంచి సేకరించనున్న భూముల్లో రోడ్లు, విద్యుత్, డ్రైనేజీ, తదితర మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసి రైతులకు 60 శాతం భూములను తిరిగి ఇవ్వనున్నారు.మిగతా 40 శాతం భూములను హెచ్‌ఎండీఏ విక్రయించనుంది. అబ్దుల్లాపూర్‌మెట్ అనంతరం దశలవారీగా మిగతా ప్రాంతాల్లోనూ భూముల అభివృద్ధికి చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

పెద్దఅంబర్‌పేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నగరానికి ఆనుకుని ఉన్న మున్సిపాలిటీలను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. పెద్ద అంబర్‌పేటలో శుక్రవారం పురపాలక సంఘం చైర్‌పర్సన్ పండుగుల జయశ్రీరాజు అధ్యక్షతన జరిగిన పురపాలక సంఘం పాలకవర్గం సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని పెద్దఅంబర్‌పేట, తుర్కయంజాల్, ఆదిబట్ల, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీల అభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి రూ.114కోట్లు మంజూరు చేయించానన్నారు. సమీప ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని పలు కాలనీల్లోంచి వచ్చే మురుగునీరు పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలోని పసుమాముల చెరువులో కలపడంతో స్థానికులు ఇబ్బందులు పడుతుండడంతో.. ఆ మురుగును మూసీ కాలువలో కలిపే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు. నియోజకవర్గంలోని మున్సిపాలిటీలను గ్రేటర్‌లో విలీనం చేయకుండా ఉండాలని సీఎంని కోరగా.. కమిటీ వేసినట్లు తెలిపారని ఎమ్మెల్యే చెప్పారు.

పలు అంశాల తీర్మానం

కౌన్సిల్ సమావేశంలో ఎజెండాలోని పలు అంశాలపై చర్చించి ప్రతి వార్డు అభివృద్ధికి రూ.50లక్షల చొప్పున కేటాయించాలని తీర్మానించారు. తట్టిఅన్నారంలోని 16 కాలనీల మురుగు నీటిని తరలించేందుకు ట్రంక్ లైన్ నిర్మాణం కోసం రూ.10కోట్లు, పెద్దఅంబర్‌పేట–పసుమాముల వరకు మంజూరైన ట్రంక్ నిర్మాణం 2 కిలోమీటర్ల పొడిగింపు కోసం మరో రూ.6 కోట్లు కేటాయించాలని తీర్మానం చేశారు. వీటితో పాటు ఇటీవల పురపాలక సంఘం పరిధిలో విలీనమైన కుత్బుల్లాపూర్, బాచారం, గౌరెల్లి, తారామతిపేట గ్రామాల అభివృద్ధి కోసం ప్రతి గ్రామానికి రూ.25 లక్షల చొప్పున కేటాయించాలని కౌన్సిల్ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో వైస్ చైర్మన్ చామ సంపూర్ణవిజయశేఖర్‌రెడ్డి, కమిషనర్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

షేక్‌పేట్ ఆకాష్ ఇనిస్టిట్యూట్‌లో అగ్ని ప్రమాదం

గోల్కొండ: షేక్‌పేట్, డ్యిక్స్ ఎవెన్యూ భవనంలో కొనసాగుతున్న ఆకాష్ ఇనిస్టిట్యూట్‌లో శుక్రవారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. అయితే ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ప్రత్యక్ష సాక్షులు, అగ్నిమాపక సిబ్బంది కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం తెల్లవారుజామున ఇనిస్టిట్యూట్ కిటికీల్లో నుంచి దట్టమైన పొగలు రావడాన్ని గుర్తించిన సెక్యూరిటీ సిబ్బంది పోలీసులు, ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్న జూబ్లీహిల్స్, మాదాపూర్, లంగర్‌హౌస్ ఫైర్ స్టేషన్‌లకు చెందిన అగ్నిమాపక యంత్రాలు మంటలను అదుపులోకి తెచ్చాయి. అప్పటికే గ్రౌండ్ ఫ్లోర్‌లో కొనసాగుతున్న రిలయన్స్ ట్రెండ్స్‌లోకి కూడా మంటలు వ్యాపించాయి. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఈ భవనం లోనుంచి మంటలు రావడంతో ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ ఘటనలో ఆకాష్ ఇనిస్టిట్యూట్‌లోని ఫర్నిచర్, ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిబూడిదయ్యాయి.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన హైడ్రా కమిషనర్..

అగ్నిప్రమాదంపై సమాచారం అందడంతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. ప్రమాదానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా నిప్పంటుకుని ఉండవచ్చునని హైడ్రా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ సిబ్బంది ఆయనకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్నిప్రమాదం సంభవించిన వెంటనే అలర్ట్ చేసే వ్యవస్థను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని భవన యజమానులకు సూచించారు. నిప్పంటుకున్న వెంటనే హైడ్రా డీఆర్‌ఎఫ్‌కు సమాచారం చేరేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మంటలను త్వరగా అదుపులోకి తెచ్చి ప్రమాదాన్ని నివారించిన డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక సిబ్బందిని అభినందించారు.

ప్రజావాణికి 3053 దరఖాస్తులు

లక్డీకాపూల్: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 3053 దరఖాస్తులు అందాయి. వీటిలో 2691 దరఖాస్తులు ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించినవి కావడం గమనార్హం. కొద్ది రోజుల క్రితం వరకూ ధరణి సమస్యలతో భూ వివాదాలకు సంబంధించిన అర్జీలే ఎక్కువ సంఖ్యలో ప్రజావాణికి వచ్చేవి. అలాంటిది ఇటీవలి కాలంలో అందుతున్న దరఖాస్తుల్లో చాలా వరకు ఇళ్ల కోసమే వస్తున్నాయి. శుక్రవారం పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కు సంబంధించి 111, విద్యుత్ శాఖ కు సంబంధించి 100, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 55, ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం 2691 దరఖాస్తులు వచ్చాయి, ఇతర శాఖలకు సంబంధించి 96 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్.జి చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించారు.

కామాంధులకు రిమాండ్


అజిత్ (ఫైల్)

ఇబ్రహీంపట్నం: బీటెక్ విద్యార్థినిపై లైంగికదాడికి పాల్పడిన యువకుడిని ఇబ్రహీంపట్నం పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. ఏసీపీ కేపీవీ రాజు తెలిపిన వివరాల ప్రకారం... మంగళ్‌పల్లి క్రాస్ రోడ్డు వద్ద ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఖమ్మం జిల్లా విద్యార్థిని(18) గత బుధవారం అర్ధరాత్రి లైంగికదాడికి గురైన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితుడైన నల్లగొండ జిల్లా గుర్రంపోడ్ మండలం జిన్నాయిచింత గ్రామానికి చెందిన ఎ.అజిత్(22)ను అరెస్టు చేసిన పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. హాస్టల్ భవన యాజమాని వద్ద అజిత్ డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

మరో ఘటనలో..

ఇబ్రహీంపట్నం రూరల్: వరసకు కూతురయ్యే బాలిక (14)పై లైంగిక దాడికి పాల్పడిన కామాంధుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన ఆంజనేయులు తన అన్న కూతురైన బాలికకు కొత్త దుస్తులు కొనిస్తానని చెప్పి గురువారం తుర్కయంజాల్ తీసుకువచ్చాడు. ఓ భవనంలో కొనసాగుతున్న ఓయో రూమ్‌కు తీసుకెళ్లి ఆమెపై అఘాయిత్యానికి ఒడిగట్టాడన్నారు. నిందితుడిని అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

రైలు పట్టాలపై పడుకుని వ్యక్తి ఆత్మహత్య

ఘట్‌కేసర్: రైలు పట్టాలపై పడుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని ఖాజీ ఖబర్ ప్రాంతానికి చెందిన అనిల్‌కుమార్ (45) శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బైక్‌పై బయలుదేరి అవుషాపూర్–కొండమడుగు ప్రాంతానికి చేరుకున్నాడు. పట్టాలకు దూరంగా చెట్లలో బైక్ నిలిపిన అతను నేరుగా వెళ్లి రైలు పట్టాలపై పడుకున్నాడు. అదే సమయంలో వచ్చిన సికింద్రాబాద్– గుంటూరు ఇంటర్‌సిటీ రైలు అతడి మీదుగా వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే సిబ్బంది సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతడి వద్ద లభించిన ఆధారాల మేరకు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్‌సీయూకు ఆసియాలో 496వ స్థానం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆసియాలోనే టాప్ 500 యూనివర్సిటీలలో ఒకటిగా గుర్తింపు సాధించింది. ఆసియాఖండంలోని 24 దేశాలలోని 3,559 యూనివర్సిటీలలో 496వ స్థానంలో నిలిచింది. దీంతో హెచ్‌సీయూలో ఆసియాలోని టాప్ 14 శాతం విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా గుర్తింపు సాధించినట్లు శుక్రవారం ప్రకటించారు. స్టడీ అబ్రాడ్ ఎయిడ్ సంస్థ ఈ ర్యాంకింగ్‌లను ప్రకటించింది. ముఖ్యంగా అధికారిక విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ స్థానం, ట్యూషన్ ఫీజు, ప్రవేశాల పరిస్థితి, అవసరమైన ఇంగ్లిష్ ప్రావీణ్యత, గ్రాడ్యుయేషన్, కోర్సుల నిర్వహణ వంటి అంశాల్లో ప్రగతి ఆధారంగా సదరు సంస్థ ఈ ర్యాంకింగ్‌లను ప్రకటించింది.

కాటమయ్య హుండీ చోరీ


హుండీని పొదల్లో పడేసిన దుండగులు


హుండీని పగలగొట్టేందుకు ఉపయోగించిన సుత్తి

నగలు, కానుకలు ఎత్తుకెళ్లిన దుండగులు

- ఇన్నోవా కారులో వచ్చినట్లు చెబుతున్న స్థానికులు
- సీసీ పుటేజీలు పరిశీలిస్తున్న పోలీసులు
- పోల్కంపల్లి ఆలయాల్లో వరుస చోరీలపై ఆందోళన

ఇబ్రహీంపట్నం: గుర్తు తెలియని దుండగులు ఆలయంలోని హుండీని ఎత్తుకెళ్లిన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని పోల్కంపల్లిలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ రామకృష్ణ, స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామ సమీపంలోని శ్రీకతమహేశ్వరస్వామి (కాటమయ్య) ఆలయంలోకి చొరబడిన దుండగులు.. కానుకల హుండీని ఎత్తుకెళ్లారు. ఆలయానికి కొంత దూరంలో ఇనుప సుత్తి(గన్ను)తో హుండీని పగులగొట్టి, అందులోని నగదు, కానుకలను తీసుకెళ్లారు. చాలా బరువున్న హుండీని ఎత్తుకెళ్లడం ఒక్కరితో సాధ్యమయ్యే పనికాదని గ్రామస్తులు చెబుతున్నారు. ఇన్నోవా కారులో వచ్చిన దుండగులే చోరీకి పాల్పడినట్లు అనుమానం వ్యక్తంచేశారు. శుక్రవారం ఉదయం ఆలయానికి వచ్చిన భక్తులు ఇది గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సమీపంలోని సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇటీవలి కాలంలో పోల్కంపల్లిలోని మూడు ఆలయాల్లో వరుస చోరీలు జరగడంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. దొంగలను పట్టుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆలయంలో హుండీ తస్కరణ

మంచాల: గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోకి చొరబడి హుండీ లూటీ చేసిన ఘటన మండలంలోని ఆరుట్ల గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. గ్రామంలోని దసరా బండ సమీపంలో గంగాదేవి–పెద్దమ్మ దేవాలయం ఉంది. అక్కడ అమ్మవారికి భక్తులు పూజలతో పాటు నగదు రూపంలో విరాళాలను హుండీలో సమర్పించుకుంటారు. గురువారం రాత్రి దుండగులు ఆలయ గ్రిల్స్ విరగొట్టి లోనికి ప్రవేశించి హుండీ తాళం పగలగొట్టి నగదు చోరీ చేశారు. అనంతరం రెండు కిలో మీటర్ల దూరంలో ఓ వ్యవసాయ పొలంలో హుండీని పడేశారు. శుక్రవారం ఉదయం గమనించిన సదరు రైతు గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. హుండీలో దాదాపు రూ.లక్ష వరకు నగదు ఉన్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వివరించారు.

వాహన బీమా.. తస్మాత్ జాగ్రత్త!

నగరంలో విస్తరించిన నకిలీ ముఠా

- పట్టుబడ్డ ముగ్గురు నిందితులు.. పరారీలో 11 మంది


నకిలీ బీమా ముఠా సభ్యుల నుంచి స్వాధీనం చేసుకున్న కంప్యూటర్లు, ఫోన్లు

శంషాబాద్: వాహనాలకు నకిలీ బీమాలు చేస్తున్న ఓ ముఠా గుట్టు రట్టయింది. వాహనదారులు ప్రమాదం జరిగిన తర్వాత సంబంధిత కంపెనీలకు క్లెయిమ్ చేయడంతో వీరి అసలు రంగు బయటపడింది. శంషాబాద్ పట్టణంలో నకిలీ ఇన్సూరెన్స్‌ల ద్వారా నష్టపోయిన వారు సైబరాబాద్ పోలీసులకు ఆశ్రయించడంతో నకిలీలకు పాల్పడుతున్న ముఠాలోని ముగ్గురిని శంషాబాద్ ఎస్ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకుని ఆర్‌జీఐఏ పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

ఆర్టీఏ ఏజెంట్‌లే..

నకిలీ బీమాలు చేస్తున్న వారిలో ప్రధానంగా ఆర్టీఏ ఏజెంట్‌లే ఉన్నారు. ప్రధాన నిందితుడుగా కిషన్‌బాగ్‌కు చెందిన అవేస్ (32), శంషాబాద్ ఆర్‌బీనగర్ కాలనీలో నివాసముంటున్న నాగర్‌కర్నూల్‌కు చెందిన శ్రావణ్‌కుమార్‌గౌడ్(31) షాబాద్ మండలంలోని సర్దార్ నగర్‌కు చెందిన మోర్పు శివకుమార్‌లు ఈ దందా నడిపిస్తున్నారు. ఇందులో ఇద్దరు ఆర్టీఏ ఏజెంట్‌లుగా పని చేస్తున్నారు. ఈ ముగ్గురు కలిసి నగరలోని ప్రకాష్, అజీమ్, అస్లాం, శ్రీనివాసులు, మజహర్, రవికాంత్, లైకుద్దీన్, ఖాజా, ఐజాజ్, హసన్, రాములతో కలిసి నకిలీ బీమాల దందా కొనసాగిస్తున్నారు.

బాధితుల ద్వారానే..

నకిలీ ముఠా నుంచి ఓ ప్రైవేటు సంస్థ ద్వారా బీమా పాలసీలు పొందిన కొందరు బాధితులు వాహన ప్రమాదానికి గురైన తర్వాత సంబంధిత సంస్థలను ఆశ్రయించడంతో అవి నకిలీవిగా తేలాయి. దీంతో వారు పోలీసులకు ఆశ్రయించారు. ఎస్ఓటీ పోలీసులు నిఘావేసి శుక్రవారం ఉదయం ప్రధాన నిందితులైన ముగ్గురిని తొండుపల్లి వద్ద అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి మూడు వాహనాలు, కంప్యూటర్లు, నకిలీ బీమా పత్రాలు, ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నగర వ్యాప్తంగా నకిలీ బీమా ముఠాకు చెందిన బాధితులు ఉన్నట్లు పోలీసులు గుర్తించి దర్యాప్తు చేస్తున్నారు.